క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ శ్రేణుల సమావేశం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం మండల శాఖ కార్యకర్తల సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు గోపాలపురంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తామని ఆ పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు బుధవారం తెలిపారు. సమావేశానికి రాష్ట్ర మాజీ హోం మంత్రి, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మునిపల్లి గుడిలో విశేష పూజలు



ప్రత్యేక పుష్పాలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

నిడదవోలు రూరల్: మండలంలోని మునిపల్లి గ్రామంలోని లక్ష్మీనారాయణ స్వామి వారి ఆలయంలో 11 ప్రదక్షణాలు, 7 వారాల కార్యక్రమంలో భాగంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి గోవిందనామాలు, సహస్రనామ స్తోత్రాలు, పారాయణ జరిపించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త పరికరాన్ని అమర్చుతున్నందున ఈనెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు బుధవారం తెలిపారు. మండలంలోని చోడవరం, తెలికిచెర్ల, గుండేపల్లి, అనంతపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్‌లకు సరఫరా నిలుపుదల చేస్తామని వివరించారు. ఆయా గ్రామాలకు త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ, మళ్లీ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా చేస్తున్నట్టు వివరించారు.

బస్ స్టేషన్లలో స్టాల్స్‌కు టెండర్ల ఆహ్వానం

కొవ్వూరు: నల్లజర్ల మండలం దూబచర్ల బస్ స్టేషన్‌లో ఉన్న స్టాల్స్, దుకాణాలకు, ఖాళీ స్థలానికి అద్దె చెల్లించి వ్యాపారాలు చేసుకునేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎస్ఎన్ కుమార్ బుధవారం తెలిపారు. తమ డిపో పరిధిలో ఉన్న బస్టాండ్‌లలో టెండర్లు దాఖలు చేయదలచిన వారు జూలై నాలుగో తేదీ లోగా కొవ్వూరు డిపోలో టెండర్ ఫారాలు పొందవచ్చని సూచించారు. టెండర్ల నిబంధనలు, ధరావత్తు సొమ్ము తదితర వివరాలన్నీ తమ కార్యాలయంలో అందిస్తామన్నారు. జూలై నాలుగో తేదీ ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రూ.250 లతో పాటు జీఎస్టీ చెల్లించి టెండరు ఫారాలు పొందవచ్చని ఆయన సూచించారు.

ముగిసిన స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఉండ్రాజవరం: స్థానికంగా కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి వారి ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. బుధవారం నాటి ఉదయం సంకల్పం, మహా శాంతి హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి వారికి చక్రస్నానం, దీక్ష విసర్జన, ధ్వజారోహణం జరిగాయి. మధ్యాహ్నం 12 నుంచి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాలకు చెందిన సుమారు 12 వేల మంది భక్తులు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్వామి వారిని దర్శించుకున్నారు. వేద పండితులు మంత్రికి ఆశీర్వచనాలు అందజేశారు. బుధవారం రాత్రి స్వామివారికి శ్రీపుష్పోత్సవం మనోహరంగా జరిగింది. ఈ ఐదు రోజుల వేడుకను వేద పండితుడు బ్రహ్మశ్రీ ఖండవల్లి సూర్యనారాయణాచార్యుల ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ సభ్యుల తోడ్పాటుతో దిగ్విజయంగా నిర్వహించారు.

గోవిందుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30వ తేదీ వరకూ ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బుధవారం ఉదయం గోపూజ, గోప్రదక్షిణలు, గణపతి పూజ నిర్వహించారు. నవగ్రహ మండపారాధన, శ్రీలక్ష్మీ గణపతి హోమం, రుద్ర నవగ్రహ హోమం, సుబ్రహ్మణ్య హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సుందర గోవిందుడిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ నిర్వాహకుడు పారుపూడి సుబ్రహ్మణ్య శర్మ దంపతుల చేతుల మీదుగా పూజలు జరిగాయి. వివిధ నదుల నుంచి సేకరించి తెచ్చిన 1,116 కలశాల నదీ జలాలతో స్వామి వారికి ఈ నెల 30న సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాల ఐదు రోజులూ విశేష పూజలతో పాటు వివిధ హోమాలు కూడా నిర్వహి హించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయం నిర్మించి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

యువతా మేలుకో.. జీవితాన్ని కాపాడుకో

- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- ర్యాలీలు, మానవహారాలు
- విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు



కొవ్వూరు బస్టాండ్ సెంటర్లో డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కొవ్వూరు: మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వాడకానికి వ్యతిరేకంగా అధికారులు, విద్యార్థులు ముక్త కంఠంతో నినదించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా దాదాపు అన్ని మండల కేంద్రాల్లోనూ నిర్వహించారు. సాధారణ, ఎస్ఈబీ పోలీసులు, వివిధ సంస్థల విద్యార్థులతో కొవ్వూరు పట్టణంలో భారీ ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ లో విద్యార్థుల మానవహారంగా ఏర్పడ్డారు. డ్రగ్స్ రహిత సమాజ స్థాపనలో తామంతా భాగస్వాములం అవుతామని విద్యార్థులతో పోలీసు అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్సై సుధాకర్, పట్టణ ఎస్సై ఎండీ జుబేర్, అభ్యాస ప్రిన్సిపాల్ పి.రఘురామ్, ఇతర పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతా బానిస కావొద్దు

దేవరపల్లి: మాదక ద్రవ్యాల వినియోగానికి యువత బానిసలు కావద్దని ఎస్ఈబీ సీఐ కె.వెంకటేశ్వరస్వామి సూచించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో కలసి ఎస్ఈబీ అధికారులు దేవరపల్లిలో అవగాహన ర్యాలీ, బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.వెంకటేశ్వరస్వామి మాట్లాడుతూ డ్రగ్స్‌పై వారం రోజులుగా దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యువతా మేలుకో.. జీవితాన్ని కాపాడుకో, మత్తు మందు అలవాటు మానుకో,. సుఖంగా జీవించు అంటూ నినాదాలు చేశారు. ఎస్సై పి. సుధీర్, స్థానిక జెడ్పీ హైస్కూల్, బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

గోపాలపురం: యువత మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని దేవరపల్లి సీఐ కె.బాల సురేష్ అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీని గోపాలపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై కర్రి సతీష్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలులో..

నిడదవోలు: డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు, ఎస్ఈబీ, పోలీసు అధికారులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఎస్ఈబీ నిడదవోలు పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్ఈబీ నిడదవోలు సీఐ కె. వీరబ్రహ్మం సారథ్యంలో స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లో వారంతా మానవహారం నిర్వహించారు. డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు అంటూ నినాదాలిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నిడదవోలు సీఐ వి.జానకి రామయ్య, ఎస్ఈబీ ఎస్సై ఆర్. దొరబాబు, ప్రిన్సిపాల్ బి.మేరీసుజాత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి. యేసురత్నం, వైస్ ప్రిన్సిపాల్ డి. హరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: పోలీసులు, స్థానిక ఏకేఆర్జీ ఫార్మసీ, ఎస్ఆర్‌కే విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా నల్లజర్లలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నల్లజర్ల జంక్షన్‌లో విద్యార్థులను ఉద్దేశించి సీఐ దుర్గా ప్రసాద్ మాట్లాడారు. చెడు స్నేహాలు పట్టి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తును చేతులారా పాడు చేసుకున్నట్టే అన్నారు. మాదక ద్రవ్యాలు తీసుకున్నా, విక్రయించినా కఠిన శిక్షలు పడతాయన్నారు. ఏకేఆర్జీ ఫార్మసీ ప్రిన్సిపాల్ రఘు వీరవర్మ, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చివటం ఉన్నత పాఠశాలలో..

ఉండ్రాజవరం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని నవజీవన్ బాల భవన్ సంస్థ కో–ఆర్డినేటర్ తేజకుమార్ సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని చివటం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వాటి వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై తేజకుమార్ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో మానవహారంగా ఏర్పడిన ఎస్ఈబీ పోలీసులు, విద్యార్థులు



నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో ..



నల్లజర్లలో ఏకేఆర్జీ, ఎస్ఆర్‌కే కళాశాల విద్యార్థులతో ర్యాలీ

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం



వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశంలో పాల్గొన్న తలారి వెంకట్రావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే తలారి, డాక్టర్ గూడూరి
- వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండల శ్రేణులతో భేటీ

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మనోధైర్యంతో ఉండాలని, వారికి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. ఆ పార్టీ మండల స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కూడా హాజరై పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపుఓటములు సహజం అని ప్రజా తీర్పును అందరూ గౌరవించాలన్నారు. ప్రజా మద్దతు ఉన్నందునే వైఎస్సార్ సీపీకి 40 శాతానికి పైగా ఓట్లు లభించాయని గుర్తు చేశారు. నాయకులు కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. పార్టీలో కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. సర్పంచులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సహా అన్ని స్థానిక సంస్థల పదవుల్లోనూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నందున మరింతగా గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎప్పుడైనా కలవవచ్చన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ నాయకులు కుంటముక్కల కేశవనారాయణ, నామా శ్రీనివాస్, గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, గూడా విజయరాజు, నక్కా చిట్టి బాబు, కోదాటి కనకయ్య, గుంటు చిన్నబ్బాయి, యాళ్ల బాబురావు , అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారం ఎవరి సొంతం కాదు



సమావేశంలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు భరోసా ఇస్తున్న మాజీ మంత్రి వనిత

- దాడులకు తెగబడే మూకలు తెలుసుకోవాలి
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ మంత్రి తానేటి వనిత భరోసా
- మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం

ద్వారకాతిరుమల: అధైర్య పడొద్దు.. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని బుధవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వనిత తానున్నానంటూ పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. 2019లో మనం గెలిచాం.. ఇప్పుడు వారు గెలిచారు.. అంతే తేడా అని అన్నారు. అధికారం ఎవరి సొంతం కాదనే విషయాన్ని దాడులకు తెగబడే మూకలు తెలుసుకోవాలని సూచించారు. అధికారం చేతికొచ్చిందన్న అహంకారంతో కొందరు కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఎవరూ తొందరపాటు చర్యలకు పాల్పడవద్దన్నారు. అలాగని ఎవరూ భయపడవద్దన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పాకలపాటి త్యాగభీమేశ్వరరావు, బొండాడ వెంకన్నబాబు, దాకారపు బంగారమ్మ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఉక్కుర్తి వెంకట్రావు, రుద్ర శివాజీ, పొనమాల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై కక్ష సాధింపులు ఉండవు



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- గోపాలపురం మండల స్థాయి అధికారులతో భేటీ

గోపాలపురం: అధికారులపై ఎలాంటి కక్ష సాధింపులూ ఉండబోవని సమన్వయంతో పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడదామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురం మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అన్ని స్థాయిల నాయకులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి దిశగా ముందుకు సాగుదామన్నారు. తాను కూడా కింది స్థాయి నుంచి వచ్చినవాడినే అన్నారు. సమావేశంలో తహసీల్దార్ డి. వనజాక్షి, ఎంపీడీఓ కె. రమేష్‌బాబు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు దేవరపల్లి మండల అధికారులతో..

దేవరపల్లి: మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సమీక్ష జరుపుతారని ఎంపీడీఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు. బుధవారం నిర్వహించాల్సిన ఈ సమీక్ష అనివార్య కారణాల వల్ల గురువారానికి వాయిదా పడినట్టు ఎంపీడీవో తెలిపారు. సమీక్ష అనంతరం సంగాయగూడెంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొంటారు.

విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు తదితరులు

చాగల్లు: విద్యార్థులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.చాగల్లు జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలోని 900 మంది విద్యార్థులకు ఆయన కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చక్కని బోధన చేస్తే విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, హెచ్ఎం. పి.వీర్రాజు, కూటమి పార్టీల నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదేళ్ల నాని, కరుటూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సమీక్ష జరిపారు.

ఉత్తీర్ణత శాతం పెంపు బాధ్యత బోధకులదే

- డీఈఓ వాసుదేవరావు
- గోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శన



గోపాలపురం జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ వాసుదేవరావు

గోపాలపురం: ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే బాధ్యత ఆయా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. బుధవారం గోపాలపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. మండలంలోని ఉపాధ్యాయులతో ఈ హైస్కూల్లో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా డీఈఓ వాసుదేవరావు మాట్లాడుతూ గతేడాది ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత శాతం తగ్గడం బాధాకరమన్నారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాల ప్రారంభం నుంచి కష్టపడి పని చేసి నూరు శాతం ఉత్తీర్ణత తీసుకు రావాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈయన వెంట ఎంఈవోలు జి. శ్రీనివాసరావు, ఏ. మహేశ్వరరావు, తిరుమలదాసు, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి శ్రీనివాసరావు

కొవ్వూరు: ఈనెల 29న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎన్. శ్రీనివాసరావు సూచించారు. ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదులతో బుధవారం కోర్టు హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు.

శ్రీవారిని దర్శించిన నాగ సాధువులు



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో నాగ సాధువులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్య క్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని బుధవారం నాగ సాధువులు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వారు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ నుంచి ఇక్కడికి వచ్చినట్టు వారు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ అనివేటి మండపంలో పలువురు భక్తులు వారి నుంచి ఆశీర్వచనాన్ని పొందారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల పరామర్శ

నిడదవోలు రూరల్: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్డి శ్రీనివాస్ తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం పరామర్శించారు. సత్యవతి చిత్ర పటానికి ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు తోలేటి శ్రీను, బూత్ కన్వీనర్ దొడ్ల మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరచాలి

ఉండ్రాజవరం: క్రమం తప్పకుండా నిర్ణీత గడువు లోగా మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్ర పరచాలని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని కె.సావరం , పాలంగి గ్రామాల్లోని రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మంచి నీటి వనరులను క్లోరినేషన్ చేయాలని, ఎప్పటికప్పుడు తాగునీటి సరఫరాను పరీక్షించి ప్రజలకు సురక్షిత నీటిని అందించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న భోజనాలను ఎంపీడీవో పరిశీలించారు. కార్యక్రమంలో పాలంగి, కె.సావరం సర్పంచులు బొక్క శ్రీనివాస్, నార్ని రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జానీ, సిబ్బంది పాల్గొన్నారు.